



ప్రశాంతి నిలయంలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు





ఎస్పీ యోగా..



ప్రశాంతి నిలయంలో విద్యార్థుల యోగాసనం

ఆరోగ్య యోగా

ప్రతిఒక్కరి జీవితంలో భాగం కావాలి

యోగా గురువుల సూచన

ఘనంగా యోగా డే

పుట్టపర్తి, జూన్ 21: యోగా.. ఆరోగ్య ప్రదాయని అనీ, ప్రతిఒక్కరి జీవితంలో భాగం కావాలని యోగాగురువులు పేర్కొన్నారు. యోగా డేని శుక్రవారం జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రశాంతి నిలయంలోని ఇండోర్ స్టేడియంలో ఘనంగా యోగా డే నిర్వహించారు. విద్యార్థులు యోగాసనాల ద్వారా ప్రత్యేకతను చాటారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మాధవరెడ్డి ఆధ్వర్యంలో యోగాడేను ఘనంగా చేసుకున్నారు. బ్రహ్మకుమారి ఓంశాంతి మందిరం, జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాలయాలు, ఆసుపత్రుల్లో యోగాడే వేడుకల్లో భాగంగా ర్యాలీలు నిర్వహించారు. యోగా ఉపయోగాలను ప్రజలకు తెలియజేశారు.

చిరుధాన్యాల సాగుతో ఆదాయం

ఏరువాక కేంద్రం జిల్లా అధికారి జాన్సన్



చిరుధాన్యాలపై అవగాహన కల్పిస్తున్న జాన్సన్

కదిరి, జూన్ 21: చిరుధాన్యాలతో ఆదాయంతోపాటు ఆరోగ్యం లభిస్తుందని ఏరువాక కేంద్రం జిల్లా అధికారి జాన్సన్ పేర్కొన్నారు. స్థానిక వ్యవసాయ పరిశోధన కేంద్రంలో శుక్రవారం చిరుధాన్య లాభాలపై శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా జాన్సన్ మాట్లాడుతూ.. చిరుధాన్యాల సాగు క్రమంగా తగ్గుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వం 2023ను చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిందన్నారు. చిరుధాన్యాలు సాగు లాభదాయకమన్నారు. కదిరి పరిశోధనాస్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ప్రసన్నరాజేష్ మాట్లాడుతూ.. వేరుశనగ సాగులో తీసుకోవలసిన జాగ్రత్తలు, స్వరక్షణ చర్యలు, ఎరువులు, మాజమాన్య పద్ధతులను వివరించారు. వివిధ ప్రభుత్వ పథకాల గురించి జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు వివరించారు. అనంతరం సజ్జ సాగులో తీసుకోవాల్సిన మెలుకువల పుస్తకాన్ని రైతులకు అందించారు. కొర్ర విత్తనాలను రైతులకు అందించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు మాధవీలత, రామసుబ్బయ్య, ఏడీఏ సత్యనారాయణ, అధికారులు, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

ముత్తుకూరులో కొనసాగుతున్న వైద్యశిబిరం

గుడిబండ, జూన్ 21:

మండలంలోని ముత్తుకూరు గ్రామంలో రెండోరోజు శుక్రవారం కూడా వైద్య శిబిరం నిర్వహించారు. అతిసారం బారినపడి వాంతులు, విరేచనాలతో రెండ్రోజుల క్రితం గ్రామంలో 30 మందికి పైగా ఆస్పత్రి పాలైన విషయం విదితమే. దీంతో గురువారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. రెండోరోజూ కొనసాగించారు. గ్రామస్థులకు పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. పలు శాఖల ఆధ్వర్యంలో గ్రామంలో పారిశుధ్య చర్యలు చేపట్టారు.



పైసలు పాయె! పదవీ పాయె!

పార్టీకోసం కష్టపడేవారు, తటస్థంగా ఉండి అధికార పార్టీకి అండగా నిలిచేవారికి ప్రత్యక్ష ఎన్నికల్లో అవకాశం దక్కకపోతే నామినేటెడ్ పదవులు ఇవ్వడం సహజం. వైసీపీ పాలనలో పార్టీకోసం కష్టపడ్డవారికంటే ముడుపులు సమర్పించుకున్నవారికి నామినెటెడ్ పదవులు అప్పగించారు. ఇందులో భాగంగా హిందూపురంలో ఎన్నికలకు ముందు కొంత మందికి నామినేటెడ్ పదవులు ఇచ్చారు. వారితో భారీగా ఖర్చు చేయించినట్లు ఆ పార్టీలో కోడై కూస్తోంది. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అధికారంలోకి రావడంతో వారు నెలలు తిరక్కుండానే పదవులకు రాజీనామా చేయాల్సి వస్తోంది. దీంతో వారు లబోదిబోమంటున్నారు.

- హిందూపురం

అయ్యో.. నాయకా..

- ఎన్నికల ముందు నామినేటెడ్ పదవులు
- లక్షల్లో ఖర్చు పెట్టుకున్న నాయకులు
- మోజు తీరకనే కుర్చీ గల్లంతు
- బోరుమంటూ.. రాజీనామా

మోజు తీరకనే..

నామినేటెడ్ పదవులు సాధారణంగా రెండేళ్ల పాటు ఉంటాయి. అధికారంలోకి వచ్చిన కొత్తలో అయితే ఇలా జరుగుతుంది. సార్వత్రిక ఎన్నికలకు ముందు పదవులు ఇస్తే ఒక వేళ ఆ పార్టీ అధికారంలోకి తిరిగి వస్తే కొనసాగుతారు. వేరేపార్టీ గెలిస్తే నామినేటెడ్ పదవులు వదులుకోవాల్సిందే. ఈ పరిస్థితుల్లో ఎన్నికలకు కొన్నినెలల ముందు కొన్ని నామినేటెడ్ పదవులు ఇప్పించారు. ఇందులో ఒక నామినేటెడ్ పదవికి రూ.10లక్షలకుపైగా ఖర్చు చేయించినట్లు సమాచారం. ఆయనకు దేవుడి మీద భక్తి ఉండటంతో ఆ నామినేటెడ్ పదవిని కోరారు. పట్టుమని పదివారాలు కూడా దేవుడి సేవ చేయకనే నామినేటెడ్ పదవి గల్లంతైంది. కూటమి అధికారంలోకి రావడంతో పదవిని వదులుకోవలసి వచ్చింది. మరొకరికి కూడా ఇలాగే జరిగింది. ఆయనకు వైసీపీతో పెద్దగా సంబంధాలు లేవు. ఆర్థికంగా బలంగా ఉండటంతో తమ పార్టీకి ఉపయోగపడతాడని భావించి, అనూహ్యంగా నామినేటెడ్ పదవిని ఇప్పించారు. ఆయన ఆ పదవి చిన్నదైనా ఎన్నికల సమయంలో ప్రచారం నిమిత్తం ఎంపీ అభ్యర్థితోపాటు మరో నాయకుడికి నియోజకవర్గంలో ప్రచారం కోసం నాలుగు కొత్త వాహనాలు కొనుగోలు చేసి అప్పగించారని సమాచారం. వాటి ఖర్చును కూడా ఆయనే భరించారు. భారీఎత్తున ఆయనతో ఖర్చు చేయించారు. వచ్చేది వైసీపీ ప్రభుత్వమేననీ, ఆయనను ఉసిగొలిపి, రూ.కోటి వరకు ఖర్చు చేయించినట్లు సమాచారం. మరో ఇద్దరు నాయకులకు నామినేటెడ్ పదవి వచ్చినపుడు కొంత మొత్తాన్ని సమర్పించుకోవాల్సి వచ్చిందని బహిరంగంగా ఆ పార్టీలో చెప్పుకుంటున్నారు. మరో నామినేటెడ్ పదవిని మైనార్టీ వర్గానికి చెందిన ఓ వ్యక్తికి కేటాయించారు. ఆయన కూడా అరకోటి వరకు పార్టీకోసం ఖర్చుచేసినట్లు తెలిసింది. ఇంత పెట్టుకున్నా కనీసం ఆరు నెలలైనా పదవిని అనుభవించలేకపోయామని వారు ఆవేదన చెందుతున్నారు.

బోరుమంటున్న బాధితులు

ఎన్నికల ముందు రూ.లక్షలు ఖర్చుచేసి పదవులు పొందారు. కూటమి అధికారంలోకి రావడంతో నామినేటెడ్ పదవులున్నవారు రాజీనామా చేయాలని ఉన్నతాధికారులు



ఆదేశించారు. ఈ పరిస్థితుల్లో లక్షలు ఖర్చు చేసి పదవులు పొంది మోజు తీరకనే రాజీనామా చేయమన్నందుకు ఒకరిద్దరు.. తమ బంధువులు, ఆప్తుల వద్ద చెప్పుకుని బోరుమన్నట్లు సమాచారం. నామినేటెడ్ పదవులున్న వారు రాజీనామా చేయాలని ఆదేశాలు వచ్చినా ఒకరిద్దరు అలాగే అంటిపెట్టుకుని ఉన్నారు. వారు పెట్టిన ఖర్చు తలచుకుని, మదన పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో వారు బోరున విలపించడంతప్ప.. చేసేదేమీ లేదు. ఇందులో ఒకరిద్దరు నామినేటెడ్ పదవులను నిలబెట్టుకునేందుకు పార్టీ మారేందుకు సైతం ప్రయత్నాలు చేస్తున్నట్లు చర్చ సాగుతోంది. ఏది ఏమైనా నామినేటెడ్ పదవులు పొందిన నాయకులు ప్రభుత్వం మారడంతో సొమ్ముపోగొట్టుకోవడంతోపాటు పదవినీ అనుభవించలేకపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతుల కోసం టాస్క్‌ఫోర్స్

భూపరిహారం పంపిణీకి చర్యలు: జేసీ

పుట్టపర్తి, జూన్ 21: జిల్లాలో జాతీయ రహదారులకు భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందించేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ నియామకానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సంయుక్త కలెక్టర్ (జేసీ) అభిషేక్ కుమార్.. సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం జాతీయ రహదారులకు భూములు కోల్పోయిన రైతులకు పరిహారం అందించేందుకు అధికారులతో సమీక్ష నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ.. గోరంట్ల మండలం బీ కొత్తపల్లి రైతులకు పరిహారం చెల్లించేందుకు టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలన్నారు. రైతులకు రూ.11.04 కోట్ల పరిహారం పంపిణీకి సిద్ధంగా ఉండాలన్నారు. ఎన్‌హెచ్ 342 ప్యాకేజ్ 1 కింద ముదిగుబ్బ నుంచి కోడూరు జంక్షన్ వరకు రోడ్డు విస్తరణలో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం అందిస్తామన్నారు. పుట్టపర్తి, గోరంట్ల, చిలమత్తూరు, కదిరి, ముదిగుబ్బ, ఓబుళదేవరచెరువు మండలాల పరిధిలో భూములు కోల్పోయిన రైతులందరికీ పరిహారం అందిస్తామన్నారు. వీటన్నింటిపై సోమవారం ప్రత్యేక సమీక్ష నిర్వహిస్తామని జేసీ తెలిపారు. సమావేశంలో పెనుకొండ సబ్‌కలెక్టర్ అపూర్వభరత్, జాతీయ రహదారుల అధికారి గిడ్డయ్య, ధర్మవరం, కదిరి ఆర్డీఓలు వెంకటశివారెడ్డి, వంశీకృష్ణ, తహసీల్దార్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేసీ అభిషేక్ కుమార్

గొంతెండుతోంది..!



రామాపురంలో తాగునీటి కష్టాలు

- 4 నెలలుగా తీవ్ర ఎద్దడి
- వ్యవసాయ బావులే శరణ్యం
- ట్యాంకర్లతో సరఫరా చేస్తున్న టీడీపీ నాయకులు
- పట్టించుకోని అధికారులు

తాడిమర్రి మండలంలోని రామాపురం గొంతెండుతోంది. 25ఏళ్లలో ఎప్పుడూ లేనంతగా గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తింది. గ్రామంలో ఏర్పాటు చేసిన ఐదు తాగునీటి పథకాలు బోర్లు ఎండిపోయాయి. నాలుగు నెలల క్రితం తవ్వించిన బోరు బావిలో సైతం నీరు అడుగంటిపోయింది. దీంతో గ్రామంలో ఒక్కటంటే ఒక్క తాగునీటి వనరు కూడా లేకపోయింది. ఊరు ఊరంతా వ్యవసాయ బోరుబావుల వద్దకు వెళ్లాల్సి వస్తోంది. వారు పడుతున్న అవస్థలు అన్నీ.. ఇన్నీ.. కావు. నాలుగు నెలలుగా తిప్పలు పడుతున్నా.. సమస్య పరిష్కరించే నాథుడే కరువయ్యాడు. ఈనెల 4వ తేదీన వెలువడిన సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో కూటమి ఘన విజయం సాధించడంతో టీడీపీ నాయకులు.. గ్రామస్థులు నీటి కష్టాలు పరిష్కరించేందుకు ముందుకొచ్చారు. ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఆ నీరే గ్రామస్థులకు దిక్కవుతోంది. రోజూ గ్రామస్థులు వేచిచూసి, నీరు పట్టుకుంటున్నారు. నీటి కోసం పనులు మానుకోవాల్సి వస్తోందని వారు వాపోతున్నారు.

- తాడిమర్రి



చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు నీటిని తరలించేందుకు ఏర్పాటుచేసిన పులివెందుల బ్రాంచ్ కెనాల్ (పీబీసీ) రామాపురం సమీపంలోనే వెళ్తోంది. కాలువ నుంచి ఎత్తిపోతల ద్వారా గ్రామానికి నీరు ఇచ్చేవారు. కాలువ నిర్మించిన నాటి నుంచి గ్రామానికి నీటి సమస్య తలెత్తలేదు. కాలువలో నీరు ప్రవహిస్తే ఊరికి తాగు, సాగునీటికి సమస్య ఉండేది కాదు. అధికారులు, అప్పటి వైసీపీ పాలకుల అనాలోచిత నిర్ణయాల కారణంగా గతేడాది పులివెందుల బ్రాంచ్ కెనాల్‌కు నీరే రాలేదు. దీంతో రామాపురంలో తాగునీటికి తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. నాలుగు నెలలుగా నీటి సమస్య ఉన్నా.. పరిష్కారం దిశగా చర్యలు తీసుకోకపోవడం శోచనీయం. నాలుగు నెలలకు ముందు ఓ బోరుబావి తవ్వించగా.. అందులో నీరు పుష్కలంగా పడింది. అది కూడా ఎండిపోయింది. 2017లో అప్పటి పోలీసు అధికారి సురేంద్రబాబు గ్రామాన్ని దత్తత తీసుకుని, నీరందించేందుకు వాటర్ ఫిల్టర్ ఉచితంగా ఏర్పాటుచేశారు. తాగునీటి సమస్య తలెత్తకూడదన్న ఉద్దేశంతో గ్రామంలో పైపులైన్ తవ్వించి, ట్యాంకర్లను ఏర్పాటుచేశారు. ఇప్పుడు అవన్నీ నిర్వీర్యమయ్యాయి. దీంతో రామాపురం గ్రామ ప్రజలు నీటి కోసం వ్యవసాయ బావుల వద్దకు పరుగులు తీయాల్సి వస్తోంది. అక్కడి నుంచి నీరు తెచ్చుకోవాలంటే నానా తిప్పలు పడేవారు. బైక్‌లు, సైకిళ్లపై పలువురు తెచ్చుకునేవారు. అవి కూడా లేనివారు బిందెలు మోసుకురావాలంటే నరకం అనుభవించేవారు.



ట్యాంకర్ నీటిని పట్టుకుంటున్న మహిళలు



వృథాగా ఉన్న ట్యాంకులు



రోజూ ఒకరికి నీటి వంతు

తాగునీటి ట్యాంకరు వచ్చే సమయానికి ఇంట్లో ఒకరు తప్పనిసరిగా ఉండాలి. అందరూ పనికెళ్లినా నీటి కోసం ఒకరు ఉండి తెచ్చుకోవాలి. ఈ తిప్పలు మాకు ఎప్పుడు తప్పుతాయో?

- రాజేంద్రప్రసాద్, రామాపురం



నీటి కోసం ఎదురుచూడాల్సిందే..

వ్యవసాయ బావుల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకోలేం. ట్యాంకర్ కోసం ఎదురు చూడాల్సిందే. ఒకరోజు పనికెళ్లినా మరుసటి రోజు నీటికోసం పడిగాపులు కాయాల్సి వస్తోంది.

- నారాయణమ్మ, రామాపురం



శాశ్వత పరిష్కారం చూపాలి

గ్రామంలో ఎన్నడూలేని విధంగా తాగునీటి సమస్య తలెత్తింది. సమస్యకు అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలి. ఈ తిప్పలు పడలేం.

- గోపాల్, రామాపురం



నిరుపయోగంగా మారిన బోరుబావి

చెన్నకేశవుడికి పౌర్ణమి గరుడసేవ

ధర్మవరం, జూన్ 21: పట్టణంలో వెలసిన లక్ష్మీ చెన్నకేశవస్వామికి శుక్రవారం పౌర్ణమి గరుడ సేవ వైభవంగా నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. అనంతరం పల్లకీలో చెన్నకేశవ స్వామి ఉత్సవవిగ్రహాన్ని ఉంచి, పట్టణ వీధుల గుండా మేళతాళాలు, వేదమంత్రాల నడుమ ఊరేగించారు. ఊరేగింపులో అన్నమయ్య సంకీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు, అర్చకులు మకరందబాబు, కోనేరు ఆచార్యులు, భానుప్రకాశ్ పాల్గొన్నారు.



పల్లకిలో చెన్నకేశవుడు

నయనానందకరం.. శ్రీవారి చింతపూలోత్సవం



స్వామివారికి చింతపూలోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

కదిరి, జూన్ 21: పట్టణంలో వెలసిన శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి చింతపూలోత్సవం శుక్రవారం నయనానందకరంగా సాగింది. జేష్టమాస పౌర్ణమిని పురస్కరించుకుని ఉదయం స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా స్వామివారు సాయంత్రం తిరువీధుల గుండా తుమ్మల రోడ్డులోని కుంతీ తీర్థం వద్దగల చింతపూల మండపానికి చేరుకున్నారు. అక్కడ స్వామివారికి అర్చకులు చింత పూలతో పూజ, నిత్యకైంకర్యాలు నిర్వహించారు. అనంతరం మండపం నుంచి బయల్దేరిన శ్రీవారు తిరువీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవానికి నారాయణస్వామి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు.

ఈసారైనా న్యాయమైన పరిహారం ఇస్తారా?

అధికారుల వద్ద రైతుల మొర

ముదిగుబ్బ, జూన్ 21: రహదారి విస్తరణలోనైనా తమకు న్యాయం చేస్తారా అని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) అధికారుల వద్ద మండల కేంద్రానికి చెందిన రైతులు మొరపెట్టుకున్నారు. మండల కేంద్రంలో రహదారి విస్తరణకు అధికారులు శుక్రవారం సర్వే చేపట్టారు. వారిని భూములు కోల్పోతున్న స్థానిక రైతులు కలిసి, పరిహారం పెంచాలని కోరారు. రైతులు మాట్లాడుతూ.. మండలకేంద్రం నుంచి పుట్టపర్తికి తొలుత రెండు లేన్ల రహదారి నిర్మాణానికి సంబంధించి అరకొరగా పరిహారం చెల్లించారన్నారు. ప్రస్తుతం మరో రెండు వరుసలకు భూములను సర్వే చేస్తున్నారనీ, భూముల ధరలు అధికంగా ఉన్న నేపథ్యంలో పరిహారం పెంచాలని కోరారు. బహిరంగ మార్కెట్ ధరల మేరకు పరిహారం చెల్లించాలని అధికారులకు విన్నవించారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల కన్వీనర్ సోమల ప్రకాష్, రైతులు ఆంజనేయులు, నాగార్జున, ప్రభాకర్, రామకృష్ణ, విశ్వనాథ్, నాయుడు పాల్గొన్నారు.



ఎన్‌హెచ్ అధికారులతో మాట్లాడుతున్న రైతులు


ప్రమాణ స్వీకారం చేస్తున్న పయ్యావుల కేశవ్, సత్యకుమార్ యాదవ్




సవిత


పరిటాల సునీత


కాలవ శ్రీనివాసులు


నందమూరి బాలకృష్ణ


కందికుంట వెంకటప్రసాద్

అనంతను క్లీన్ స్వీప్ చేసిన మేము..

- అసెంబ్లీలో ప్రమాణం చేసిన ఎమ్మెల్యేలు
- ఒకరు బీజేపీ.. 13 మంది టీడీపీ..
- కూటమి శ్రేణుల్లో పట్టరాని ఆనందం



ఉమ్మడి జిల్లాలో క్లీన్ స్వీప్ చేసి.. రికార్డు సృష్టించిన కూటమి ఎమ్మెల్యేలు అసెంబ్లీలో శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. ధర్మవరం నుంచి బీజేపీ అభ్యర్థి సత్య కుమార్ యాదవ్, మిగిలిన 13 నియోజక వర్గాల్లో టీడీపీ అభ్యర్థులు విజయబావుటా ఎగురవేశారు. ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్య చౌదరి వీరిచేత ప్రమాణ స్వీకారం చేయించారు.

(ఆంధ్రజ్యోతి, అనంతపురం)

మంత్రులతో మొదలు..

ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్, పెనుకొండ ఎమ్మెల్యే సవిత, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్‌కు మంత్రి పదవులు దక్కాయి. సీఎంగా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేసిన రోజునే వీరు ముగ్గురు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. మూడు దశాబ్దాలకు పైగా రాజకీయాల్లో కొనసాగుతున్న పయ్యావుల కేశవ్ ఏడుసార్లు ఎమ్మెల్యేగా పోటీచేసి.. ఏకంగా ఐదు సార్లు విజయం సాధించారు. తొలిసారి మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలలో ఆయన మొదట శాసనసభ్యుడిగా ప్రమాణస్వీకారం చేశారు. ఆ తరువాత మంత్రి సవిత ప్రమాణ స్వీకారం చేశారు. తొలిసారి ఎన్నికల్లో పోటీచేసి గెలుపొందిన ఆమెకు మంత్రి పదవి వరించింది. సత్యకుమార్ యాదవ్‌కు పొత్తు ధర్మంలో భాగంగా బీజేపీ కోటాలో మంత్రి పదవి లభించింది. ఆయన ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు.

మాజీ మంత్రులు..

మాజీ మంత్రి పరిటాల సునీత రాప్తాడు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు. ఇప్పటికి ఆమె నాలుగుసార్లు ఎమ్మెల్యేగా పోటీచేసి విజయం సాధించారు. పరిటాల సునీత రాజకీయాల్లోకి వచ్చిన తరువాత ఇప్పటి వరకూ ఓటమి ఎరుగరు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు రాయదుర్గం ఎమ్మెల్యేగా ప్రమాణం చేశారు. గతంలో ఆయన ఎంపీగా కూడా సేవలు అందించారు. ఎమ్మెల్యేగా మూడుసార్లు పోటీచేసి.. రెండుసార్లు విజయం సాధించారు. మాజీ మంత్రి గుమ్మనూరు జయరాం గుంతకల్లు ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం చేశారు.

సీనియర్లు..

హిందూపురం ఎమ్మెల్యేగా నందమూరి బాలకృష్ణ ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనలో ఎక్కడా తడబాటు కనిపించలేదు. హిందూపురం నుంచి ఆయన వరుసగా మూడుసార్లు పోటీచేసి హ్యాట్రిక్ విజయాన్ని అందుకున్నారు. కదిరి ఎమ్మెల్యేగా కందికుంట వెంకటప్రసాద్ ప్రమాణ స్వీకారం చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా ఒకసారి, టీడీపీ తరుపున నాలుగుసార్లు ఆయన ఎమ్మెల్యేగా పోటీచేశారు. రెండుసార్లు గెలుపొందారు.

తొలిసారి అసెంబ్లీలో..

తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ రెండోసారి ఎమ్మెల్యేగా పోటీ చేసి.. తొలిసారి విజయం సాధించారు. ఎమ్మెల్యేలుగా ప్రమాణ స్వీకారం చేశారు. మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్ తొలిసారి పోటీచేసి విజయాన్ని అందుకున్నారు. పల్లె సింధూరరెడ్డి ఇంగ్లీషులో, మిగిలిన వారు తెలుగులో ప్రమాణం చేశారు.

పార్టీ కండువాలతో..

అసెంబ్లీలో ఉమ్మడి జిల్లా టీడీపీ ఎమ్మెల్యేలు ప్రతి ఒక్కరూ పార్టీ కండువాను వేసుకొనే ప్రమాణం చేశారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి జిల్లా నుంచి 14 మంది ఎమ్మెల్యేలు కూటమి పక్షాన గెలిచి ప్రమాణం చేయడం శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. ప్రమాణ స్వీకారోత్సవాన్ని తిలకించేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు, ఎమ్మెల్యేల అభిమానులు, బంధువులు టీవీలకు అతుక్కుపోయారు.


అమిలినేని సురేంద్రబాబు


పల్లె సింధూరారెడ్డి


బండారు శ్రావణి


జేసీ అశ్మిత్ రెడ్డి



గుమ్మనూరు జయరాం


దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్


ఎంఎస్ రాజు

జనం సొమ్ము జేబులోకి..!

- పిల్లల సొమ్ము, ఎన్నికల నిధులతో డీఎస్‌డీఓ జల్సాలు
- వైసీపీ వీర విధేయుడిగా పేరు
- స్టేడియంలో జనరేటర్, క్రీడాసామగ్రి మాయం
- ప్రశ్నించిన అధికారులకు బెదిరింపులు
- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న కోచ్‌లు
- క్రీడాశాఖలో వివాదాస్పదం.. ఆ అధికారి నిర్వాకం



అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 21: పిల్లల సొమ్ము, ఎన్నికల నిధులతో ఆ జిల్లాధికారి ఆడుకుంటున్నారు. లక్షల విలువ చేసే సామగ్రిని సైతం తరలిస్తున్నారు. వైసీపీ విధేయుడిగా స్వామిభక్తిని చాటుకుంటున్నారు. పిల్లల ఫీజును కలెక్టర్ పేరు చెప్పుకుని పక్కదారి పట్టిస్తున్నారు. నగరంలోని అశోక్‌నగర్‌లో క్రీడాశాఖకు చెందిన ఇండోర్ స్టేడియంలో ఉన్న రూ.12లక్షల జనరేటర్, 10లక్షల క్రీడాసామగ్రిని మాయం చేశారు. విలువైన జనరేటర్‌ను ఎవరు తీసుకెళ్లారనేది.... క్రీడాశాఖలో చర్చనీయాంశంగా మారింది. గతంలో టీడీపీ హయాంలో జిల్లాకు మంజూరైన ఐదు అకాడమీలకు చెందిన క్రీడా సామగ్రిని ఇండోర్‌స్టేడియంలో భద్రపరిచారు. జనరేటర్‌తోపాటు క్రీడాసామగ్రిని తరలించారనే ప్రచారం ఆశాఖలో జోరుగా సాగుతోంది. ఇదిలా ఉంటే ఎన్నికలకు ముందే జిల్లాకు వచ్చిన డీఎస్‌డీఓ వైసీపీకి అనుకూలంగా ప్రచారం సైతం నిర్వహించి స్వామి భక్తిని చాటుకున్నారు. అంతేగాక తన సామాజికవర్గంలో వైసీపీ పట్ల అపారమైన ప్రేమ కురిపిస్తుండడం గమనార్హం. ఎన్నికల్లో జేఎన్‌టీయూలో ట్రాఫిక్ నియంత్రణకు నియమించిన కోచ్‌లు, క్రీడాకారుల పారితోషికం రూ.3లక్షలు మాయం చేసినట్లు చెబుతున్నారు. కోచ్‌లకు ఒక్కొక్కరికి రూ.2వేలు మాత్రమే చెల్లించి మిగిలిన సొమ్మును క్రీడాకారులకు ఇవ్వకుండా డీఎస్‌డీఓ తన జేబులో వేసుకున్నట్లు చర్చించుకుంటున్నారు. సొమ్మొకరిది...సోకు మరొకరిది అన్న చందంగా పిల్లల ఫీజులు, ఎన్నికల విధుల పారితోషికం నిధులతో డీఎస్‌డీఓ జల్సా చేస్తున్నారనే ప్రచారం ఆశాఖలో జోరుగా సాగుతోంది. డీఎస్‌డీఓ చేస్తున్న అవినీతి అక్రమాలకు సిబ్బంది సహకరిస్తుండగా... కోచ్‌లు అభ్యంతరం వ్యక్తం చేస్తూ....అసంతృప్తి వ్యక్తం చేస్తూవస్తున్నారు. తమకు ఇటువంటి డీఎస్‌డీఓ వద్దు... అంటూ మొరపెట్టుకుంటున్నారు.


అశోక్‌నగర్ ఇండోర్‌స్టేడియం

జనరేటర్, సామగ్రి మాయం

ఇండోర్ స్టేడియంలో రూ.12లక్షల జనరేటర్, రూ.10లక్షల క్రీడాసామగ్రి మాయమైంది. దీనిపై ఎవరూ స్పందించడం లేదు. జనరేటర్, క్రీడాసామగ్రి అమ్ముకున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియం మొత్తం డీఎస్‌డీఓ ఆధీనంలోనే ఉంటుంది. అయితే జనరేటర్, క్రీడాసామగ్రి అదృశ్యం కావడంపై మాత్రం ఎవరూ నోరుమెదపడం లేదు. ఇండోర్ స్టేడియంలో క్రీడాకారులకు నీటి వసతి, మరుగుదొడ్ల కొరత ఉన్నప్పటికీ...వాటిపై స్పందించే నాథుడే కరువయ్యారు.


జనరేటర్ రూం

విచ్చలవిడిగా ఖర్చు

పిల్లలు చెల్లించిన ఫీజు సొమ్ముతో విచ్చలవిడిగా ఇండోర్‌స్టేడియంలో ఖర్చు చేస్తున్నారు. వైసీపీకి అత్యంత ప్రీతిపాత్రుడైన డీఎస్‌డీఓ ఆది నుంచి వివాదాస్పదమవుతున్నారు. దీంతో కోచ్‌లు, డీఎస్‌డీఓ మధ్య అనేకమార్లు వాగ్వాదాలు తలెత్తాయి. వైసీపీకి అనుకూలంగా క్రీడాశాఖలో ఎన్నికల ముందు ప్రచారం సైతం నిర్వహించారంటే...ఆ డీఎస్‌డీఓకు స్వామిభక్తి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇక ఎవరైనా కోచ్‌లు, ఇతర సందర్శకులు స్టేడియంలోని కార్యాలయానికి వస్తే...కలెక్టర్ పేరు చెప్పి తన సామాజిక వర్గంతో సొంత పనులు చేసుకుంటున్నారనే ప్రచారం ఆశాఖలో జోరుగా సాగుతోంది. ఇండోర్ స్టేడియంలోని ఓ గదిలో పాగా వేసిన డీఎస్‌డీఓ... ఓ మతప్రచార కార్యాలయంగా మార్చేశారు. ఇదిలా ఉంటే కలెక్టర్ పేరుతో ఇప్పటి వరకు పిల్లల సొమ్ము సుమారు రూ.10లక్షలు అభివృద్ధి మాటున నిధులు కాజేశారు. ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలకు సంబంధించిన సుమారు రూ.5లక్షల నిధులు ఎక్కడికి వెళ్ళాయో లెక్కలు లేకుండా పోయాయి.

పిల్లల సొమ్ముతోనే అన్ని పనులు చేస్తున్నారు

- మేఘ స్వరూప్, నగరపాలక కమిషనర్

మున్సిపాలిటీ నిధులతో పనులు చేస్తున్నామని.... డీఎస్‌డీఓ ప్రచారం చేస్తుండగా...ఇదే విషయాన్ని నగర పాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్ మాత్రం అంగీకరించలేదు. మున్సిపాలిటీ నుంచి నగరంలోని ఎంపిక చేసిన ప్రాంతాల్లో నెట్ ప్రాక్టీస్ మ్యాట్లు (మినీస్టేడియం) ఏర్పాటు చేస్తున్నామని... డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియానికి ఎటువంటి నిధులు చెల్లించలేదని... అదంతా పిల్లల ఫీజుల నుంచి వచ్చిన సొమ్ముతోనే పనులు చేస్తున్నారని చెప్పుకొచ్చారు.

సహకరిస్తున్న సిబ్బంది..!

జిల్లా క్రీడాశాఖలో నాలుగు నెలలుగా డీఎస్‌డీఓ వ్యవహరిస్తున్న చిత్రమైన తీరుతో కోచ్‌లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అయితే కోచ్‌లు బహిరంగంగా ప్రశ్నిస్తే ఇక వారి పరిస్థితి అంతే. కలెక్టర్‌కు పిర్యాదు చేస్తానంటూ...బెదిరింపులకు దిగుతున్నారు. పోలింగ్ రోజు, కౌంటింగ్‌రోజున జేఎన్‌టీయూలో సుమారు వంద మంది క్రీడాకారులను ట్రాఫిక్ నియంత్రణ విధులకు నియమించారు. ఇందులో కోచ్‌లూ ఉన్నారు. కోచ్‌లకు మాత్రం ఎన్నికల విధులకు సంబంధించిన పారితోషికంగా నామమాత్రంగా ఒక్కొక్కరికి రూ.2వేలు చొప్పున చెల్లించారు. క్రీడాకారులు వందమందికి మాత్రం పారితోషికం ఇవ్వకపోగా...విధుల్లో కనీసం మంచినీరు, భోజనవసతి కల్పించకపోవడం గమనార్హం. ప్రభుత్వం మాత్రం సుమారు రూ.3లక్షలు వరకు చెల్లించినట్లు సమాచారం. అయితే ఈ నిధులన్నీ ఎక్కడికి వెళ్ళాయో...మరి ఆ డీఎస్‌డీఓనే చెప్పాలి.


ప్రకృతి వ్యవసాయ అధికారులతో జాంబియా బృందం

ముగిసిన జాంబియా బృందం పర్యటన

అనంతపురం అర్బన్, జూన్ 21: ఉమ్మడి అనంత జిల్లాలో ప్రకృతి వ్యవసాయంపై అధ్యయనం చేసేందుకు వచ్చిన జాంబియా బృందం పర్యటన శుక్రవారంతో ముగిసింది. ఈనెల 8 వతేదీ నుంచి 20వతేదీ దాకా ఉమ్మడి జిల్లాలోని తాడిపత్రి, బత్తలపల్లి, పరిగి మండలాల్లోని పలు గ్రామాల్లో జాంబియా దేశానికి చెందిన 16 మంది బృందం సభ్యులు పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగుచేసే పంటల విధానాన్ని పరిశీలించారు. ఘన, ద్రవజీవామృతం తయారుచేసే విధానాన్ని తెలుసుకున్నారు. విత్తన సమయంలో విత్తన శుద్ధి చేసే తీరు, సాగులో పలు దశల్లో పాటించాల్సిన పద్ధతులను తెలుసుకున్నారు. పర్యటన ముగియడంతో తిరిగి జాంబియాకు బయలుదేరి వెళ్లారు.

కన్నుమూస్తూ.. ఇద్దరికి చూపు..

నార్పల, జూన్21: మండలంలోని బొందలవాడ గ్రామానికి చెందిన దుగ్గిమి చంద్రమౌళి విద్యుదాఘాతంతో మృతిచెందిన విషయం తెలిసిందే. చనిపోతూ మరో ఇద్దరు జీవితాల్లో వెలుగు నింపి, ఆదర్శ ప్రాయుడయ్యారు. తన కళ్లని ఎల్‌వీ కంటి ఆసుపత్రికి దానం చేశారు. కుటుంబ సభ్యుల ఆమోదం మేరకు కళ్లని దానం చేశారని గ్రామస్థులు తెలిపారు.


ప్రశంసాపత్రం అందజేస్తూ..

టీడీపీ మహిళా కార్యకర్తపై దాడి

- పోలీసులకు ఫిర్యాదు

చెన్నేకొత్తపల్లి, జూన్ 21: మండలంలోని బసినేపల్లి గ్రామంలో టీడీపీ మహిళా కార్యకర్త జ్యోతిపై వైసీపీకి చెందిన మహిళలు శుక్రవారం దాడి చేశారు. బాధితురాలు జ్యోతి తెలిపిన వివరాల మేరకు....పిల్లలను స్కూల్‌లో వదిలి ఇంటికి వెళ్తుండగా వైసీపీకి చెందిన ఐదుగురు మహిళలు ఉన్నపళంగా దాడి చేశారు. నానా దుర్భాషలాడుతూ ఆమెను చుట్టు ముట్టి కింద పడేసి విచక్షణా రహితంగా కాళ్లతో తొక్కారని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. 'మీ పార్టీ అధికారంలో ఉందనుకుంటున్నావేమో నీ అంతు చూస్తామని బెదిరింపులకు దిగారు. అడ్డుకోబోయిన వారిపై కూడా తిరగబడ్డారని తమకు న్యాయం చేయాలని ఆమె పోలీసులను వేడుకుంది. కేవలం ఉద్దేశపూర్వకంగానే తనపై దాడి చేశారని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. టీడీపీ నాయకుడు భర్త గురుప్రసాద్, పార్టీశ్రేణులతో కలిసి పోలీసులకు పిర్యాదు చేసింది. ఎన్నికల సమయంలో నాగసముద్రం, బసినేపల్లి గ్రామాల్లో టీడీపీ వారిపై వైసీపీ నాయకులు దాడి చేసినసందర్భంలో తాము పిర్యాదు చేసినప్పుడే పోలీసులు చర్యలు తీసుకుని ఉంటే ప్రస్తుతం ఇలాంటి దాడి సంఘటనలు జరిగేవి కావని పలువురు టీడీపీ మండల నాయకులు వాపోయారు. ఇప్పటికైనా పోలీసులు దాడులకు పాల్పడిన వైసీపీ శ్రేణులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు.


గాయపడిన జ్యోతి

చీనీకాయలు టన్ను రూ.32 వేలు

అనంతపురంరూరల్, జూన్ 21: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.32 వేలు, కనిష్ఠంగా రూ.10 వేలు, సరాసరి రూ.20 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 961 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

ఉచిత న్యాయసేవలను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్

అనంతపురం క్రైం, జూన్21 : జిల్లా న్యాయసేవాధికార సంస్థ ద్వారా అందిస్తున్న ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం న్యాయసేవాసదన్‌లో శాశ్వత లోక్‌అదాలత్‌లో ప్రజాప్రయోజన కేసుల పరిష్కారానికై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల ప్రజా ప్రయోజన శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్, న్యాయాధికారి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లోక్ అదాలత్‌లో ఎన్నో ఏళ్ల కేసులకు సత్వర పరిష్కారం లభిస్తుందన్నారు. ఫిర్యాదు దాఖలు చేయడానికి ఎలాంటి కోర్టు రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. రూ.కోటి పరిహారం వరకు వివాదాల పరిష్కారానికి తీర్పు వెలువరించగల అధికారం వుందన్నారు. లోక్‌అదాలత్ శాశ్వత సభ్యులు రాజశేఖర్‌రెడ్డి, ప్రధాన న్యాయ సహాయ ప్రతివాద న్యాయవాది ఇటికె నల్లప్ప పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్

ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం



కొత్తపేట వేంకటేశ్వర ఆలయ ఆవరణలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

ధర్మవరం, జూన్ 21: జిల్లావ్యాప్తంగా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. సూర్యస్కూల్‌లో యోగాసనాల వల్ల కలిగే లాభాల గురించి హిందీపండిట్ వేణుగోపాలచార్యులు విద్యార్థులకు వివరించారు. అదేవిధంగా సత్యకృప మహిళా డిగ్రీ కళాశాలలో, కొత్తపేట వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ధర్మవరం యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలను జరిగాయి. కేహెచ్ ప్రభుత్వడిగ్రీ కళాశాలలో పలువురు యోగాసననాలు వేశారు. కార్యక్రమాల్లో సత్యకృప మహిళా డిగ్రీకళాశాల కరస్పాండెంట్ డోలాపెద్దిరెడ్డి, సూర్యపాఠశాల హెచ్‌ఎం నరేంద్రబాబు, కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ గోపాల్‌నాయక్, పీడీ ఆనంద్ పాల్గొన్నారు.



యోగాసనాలు వేస్తున్న న్యాయాధికారి

కదిరిలీగల్: కోర్టు ఆవరణలో జరిగిన యోగా దినోత్సవంలో న్యాయాధికారి మీనాక్షి సుందరి పాల్గొన్నారు. యోగా మాస్టార్లు లక్ష్మీనారాయణ, కుసుమసాయి యోగాసనాల పాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షులు నాగేంద్ర, సభ్యులు సురేంద్ర, రమేష్, సుబ్బరాజుగుప్త, లోకేశ్వర్ రెడ్డి తదితరులున్నారు.

కదిరి: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం 10వ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంఇఓలు చెన్నక్రిష్టా, ఓబుళరెడ్డిలు పాల్గొన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు యోగాసనాలు చేశారు. ఈ సందర్భంగా ఎంఇఓలు మాట్లాడుతూ యోగా వల్ల ఆరోగ్యం మెరుగుపడుతుందని అన్నారు. చురుకైనా జీవనశైలిని అలవర్చుకోవాలని కోరారు. ఈకార్యక్రమాలు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటాచలం, పీడీలు శంకర్‌నాయక్, యశోధమ్మ, సుజాత, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థినీలు పాల్గొన్నారు.

నల్లమాడ: మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ పాఠశాల, ఎస్టీ బాలుర ఆశ్రమ పాఠశాలల్లో అంతర్జాతీయ యోగాదినోత్సవం జరిగింది. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు భాస్కర్‌రెడ్డి, సతీష్ పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు: మండలంలోని వడ్డివారిపల్లి వద్ద ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో జరిగిన యోగా దినోత్సవంలో ఎంఈఓలు సురేష్‌బాబు, రమణ పాల్గొన్నారు. అదేవిధంగా డబురువారిపల్లిలో ఉపాధి ఏపీడీ శ్రీనివాసరెడ్డి, సీఎల్‌ఆర్‌సీ శారద పాల్గొన్నారు.

తాడిమర్రి: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో జరిగిన యోగా దినోత్సవంలో ఎంపీడీఓ మణిమంజరి పాల్గొన్నారు. విద్యార్థులకు యోగాసనాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓలు క్రిష్ణమోహన్, వెంకటేశ్, ప్రధానోపాధ్యాయురాలు అరుణ, పీడీ వేణుగోపాల్ పాల్గొన్నారు.

నంబులపూలకుంట: మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్డీయే కూటమినాయకులు, కార్యకర్తలు, విద్యార్థులతో యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షులు రామమోహన్, ఇంతియాజ్, టీడీపీ గంగాశేఖర్, నరసింహులనాయుడు పాల్గొన్నారు.



యోగా సాధన చేస్తున్న కూటమి నాయకులు, విద్యార్థులు

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు వేసిన యోగాసనాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంపీపీ ఆదినారాయణ యాదవ్, ఎంఈఓ రమణప్ప, బాలుర పాఠశాల హెచ్.ఎం రమాదేవి పాల్గొన్నారు.



యోగా చేస్తున్న బాలికలు

కదిరి అర్బన్: పట్టణంలోని డిగ్రీకళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రిన్సిపాల్ డాక్టర్ స్మిత ఆధ్వర్యంలో జరిగాయి. కార్యక్రమంలో గురూజీ లక్ష్మీనారాయణ, పీడీ నరసింహచారి పాల్గొన్నారు.



ఆసనాలు వేస్తున్న అధ్యాపకులు

పుట్టపర్తి రూరల్: యోగాతో జీవితం సంతోషమయమని జిల్లా ఎన్సీడీ, సీడీ ఆర్‌బీఎస్కే ప్రోగ్రాం డైరక్టర్ డాక్టర్ నివేదిత, జిల్లాడీపీఎంఓ డాక్టర్ కేసీకే నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని ఎనుమలపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో అంతర్జాతీయ యోగాదినోత్సవాన్ని పురస్కరించుకొని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ జ్యోత్స్న పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది

నాసిరకంగా నాడు-నేడు పనులు

రూ.లక్షలు వెచ్చించినా నిరుపయోగం

కూలడానికి సిద్ధంగా ఉన్న ప్రహరీ



గాండ్లపెంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

గాండ్లపెంట, జూన్ 21: వైసీపీ ప్రభుత్వ పాలనలో చేపట్టిన నాడు-నేడు పనులు నాసిరకంగా ఉన్నాయంటూ ప్రజలనుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలో వైసీపీ పాలనలో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. అందులో నాడు నేడు పనులను ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలో చేపట్టారు. రూ. కోటికిపైగా నిధులు ఖర్చు చేసేందుకు అప్పట్లో ప్రణాళికలు తయారు చేశారు. వాటిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మరమ్మతులో భాగంగా బాత్‌రూముల్లో టైల్స్, పైపులు, విద్యుత్, ఆసుపత్రి ఆవరణంలో సిమెంటు రోడ్డుపనులు పూర్తి చేశారు. అదేవిధంగా పబ్లిక్ హెల్త్ బ్లాక్ పునాదులు వేసి నిలివేశారు.

నాసిరకం పనులతో ఇబ్బందులు

నాడు-నేడు పనుల్లో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మరమ్మతుల కోసం రూ.లక్షలు ఖర్చు చేశారు. బాత్ రూముల్లో టైల్స్, వాష్‌బేసిన్లు నూతనంగా అమర్చారు. ఇవి నాసిరకంగా ఉండటంతో వాష్‌బేసిన్ కొళాయిలు విరిగిపోయాయి. బాత్‌రూముల్లో నీరు వెళ్లక ఉపయోగించడానికి వీలుకాకుండా ఉంది. దీంతో నిరుయోగంగా మారాయి. రూ.లక్షలు ఖర్చు చేసి మరమ్మతులు జరిపినా ఉపయోగంలేకుండా పోయిందని, తాము ఇబ్బందులు పడుతున్నామని వైద్య సిబ్బంది వాపోతున్నారు.

కూలడానికి సిద్ధం

ఆసుపత్రి చుట్టూ ప్రహరీని గతంలో నిర్మించారు. అయితే అప్పట్లో పలుచోట్ల ప్రహరీ దెబ్బతింది. మరమ్మతులు చేసేందుకు నిధులు విడుదల చేసి కాంట్రాక్టర్‌కు అప్పగించారు. అప్పట్లో అంతంతమాత్రంగా పనులు చేసి, రంగులు పూసి, బిల్లులు డ్రా చేసుకున్నారు. ప్రస్తుతం ప్రహరీ పునాదుల వద్ద రంధ్రాలు పడి బీటలువారాయి. రూ. లక్షలు ఖర్చు చేసినా ప్రహరీ బీటలువారడం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపమా..? అన్న సంశయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

బీటలువారుతున్న పునాదులు

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు చికిత్స అందించేందుకు నాడు నేడు పనులకింద రూ. 35లక్షలతో నిర్మాణం చేపడుతున్నారు. పునాదులు పూర్తయ్యాయి. అయితే పునాదులు భూమిలోకి కుంగిపోయి బీటలువారుతున్నట్లు ప్రజల అంటున్నారు. ఆదిలోనే ఇలా ఉంటే భవనం పూర్తి చేస్తే ఎలా ఉంటుందన్న అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణ పనులుకూడా ముందుకు సాగడంలేదు. స్థలానికి సంబంధించి కోర్టు నోటీసులు ఇవ్వడంలో పనులను నిలిపివేశారు.

మరమ్మతులు చేయిస్తాం

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పాడైన కొళాయిలను, బాత్‌రూమ్‌లో నీరు ముందుకు వెళ్లడానికి మరమ్మతులు చేయిస్తాం. నిర్మాణాలు కూడా ముందుకు సాగిస్తాం.

- శైలజ, డీఈ, ఆర్‌అండ్‌బీ



ఉపయోగించుకోలేని స్థితిలో బాత్‌రూంలు



ఆసుపత్రి ప్రహరీ దుస్థితి ఇదీ..

'పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలి'



విద్యార్థులతో హుందాయ్ కంపెనీ ప్రతినిధులు

కొత్తచెరువు, జూన్ 21: చిన్నతనం నుంచి విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవరచుకోవాలని హుందాయ్ కంపెనీ ఫ్రాన్సిస్ జనరల్ మేనేజర్ కళాసాగర్‌రెడ్డి సూచించారు. పుస్తకపఠనం వల్ల విజ్ఞానంతో పాటు మేధాశక్తి పెంపొందుతుందన్నారు. మండలంలోని బండ్లపల్లి జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో గ్రంథాలయాన్ని హుందాయ్ కార్ల కంపెనీ ఆధ్వర్యంలో నిర్మించారు. గ్రంథాలయాన్ని శుక్రవారం ఆ కంపెనీ ప్రతినిధులు ప్రారంభించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో హుందాయ్ కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ చదువుతోపాటు విద్యార్థులు గ్రంథాలయంలోని పుస్తకాలను చదువుతుండాలన్నారు. శ్రీసత్యసాయిజిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సౌకర్యార్థం సీఆర్ యాక్టివిటీస్ కింద పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అందులో భాగంగా గ్రంథాలయాన్ని రూ.12లక్షల వ్యయంతో నిర్మించామన్నారు. గ్రంథాలయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మొక్కు తీర్చుకునేందుకు తరలిన టీడీపీ నాయకులు

నల్లచెరువు, జూన్ 21: మొక్కులు తీర్చుకునేందుకు టీడీపీ నాయకులు శుక్రవారం అరుణాచలం వెళ్లారు. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి విజయం సాధించి సీఎంగా నారా చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యేగా కందికుంట వెంకటప్రసాద్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా బస్సులో వెళ్లారు. అల్లాబక్షు, అబ్దుల్ ఖాదర్, దాద్దెం శివారెడ్డి, సర్పంచ్ హర్షవర్ధన్‌నాయుడు తదితరులు వెళ్లారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ఆటో

ఒకరికి గాయాలు

ధర్మవరం, జూన్ 21: పట్టణంలోని మారుతీనగర్‌లో ద్విచక్రవాహనాన్ని ఓ ఆటో ఢీకొనడంతో చేనేత కార్మికుడు తీవ్రంగా గాయపడ్డారు. మారుతీనగర్‌కు చెందిన చక్రవర్తి శుక్రవారం కూలిమగ్గం నేయడానికి ద్విచక్రవాహనంలో దుర్గానగర్‌కు వెళ్తనాడు. కోదండ రామస్వామి ఆలయం వద్దకు రాగానే వెనుక వైపు నుంచి మినరల్ వాటర్ ఆటో ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో చక్రవర్తి తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబసభ్యులు గాయపడిన చక్రవర్తిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్సలు అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికితరలించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ధర్మవరం, జూన్ 21: పట్టణంలోని చంద్రబాబునగర్‌కు చెందిన సుబ్బరాయుడు శుక్రవారం క్రిమిసంహారక మందు సేవించి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబసభ్యులు గమనించి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి పంపారు. ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియరాలేదు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, విచారణ చేపట్టారు.

ఉపాధ్యాయ సమస్యలపై మంత్రులకు వినతి

ఓబుళదేవరచెరువు, జూన్ 21: ఉపాధ్యాయ సమస్యలపై శుక్రవారం నీటిపారుదల శాఖమంత్రి రామానాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కలిసి విన్నవించినట్లు 1998 ఉపాధ్యాయ సంఘం నాయకులు తెలిపారు. అమరావతిలో అసెంబ్లీ భవనం వద్ద వారిని కలిసి వినతిపత్రం అందచేసినట్లు చెప్పారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కమ్మల నాగరాజు, రఘువీరారెడ్డి, చెన్నకేశవులు, రాఘవేంద్ర, అప్పలరాజు మంత్రులను కలిసినవారిలో ఉన్నారు.

ఘనంగా శ్రీగిరి ప్రదక్షిణ



గిరిప్రదక్షిణలో పాల్గొన్న సాయిభక్తులు

పుట్టపర్తి, జూన్ 21: శీసత్యసాయి శ్రీగిరి ప్రదక్షిణను శుక్రవారం ఘనంగా నిర్వహించారు రాత్రి 7 గంటల ప్రాంతంలో ప్రశాంతినిలయం గణేష్ గేట్‌వద్ద సత్యసాయి రథానికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. అనంతరం సత్యసాయి భక్తిగీతాలు ఆలపిస్తూ రథాన్ని లాగుతూ గిరిప్రదక్షిణ చేశారు. మహా మంగళహారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు.

వేణుగోపాల స్వామికి ప్రత్యేక పూజలు

నల్లచెరువు, జూన్ 21: మండలకేంద్రంలోని గీతా మందిరంలో వేణుగోపాల స్వామికి శుక్రవారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా స్వామివారికి ఉదయం నుంచి అభిషేకాలు, పూజలు జరిగాయి. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు దాద్దెం వెంకటశివారెడ్డి, భాస్కర్‌రెడ్డి, సూర్యనారాయణ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి రూ.40 వేలు వితరణ

ధర్మవరం రూరల్, జూన్ 21: మండలంలోని ఏలుకుంట్ల గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ ఏగినాటిశ్రీనివాసులు గ్రామ అభివృద్ధి కోసం రూ.40వేల నగదును వితరణ చేశారు. శుక్రవారం గ్రామానికి చెందిన గుత్తా ఓబుళనాయుడు చేతులమీదుగా నగదును అందజేశారు.



బత్తలపల్లిలో ఏరువాక పౌర్ణమి నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు



పడమటవారిపల్లిలో..

ఘనంగా ఏరువాక పౌర్ణమి

బత్తలపల్లి, జూన్ 21: మండల కేంద్రం సమీపంలో సీపీఐ, రైతు సంఘం నాయకులు శుక్రవారం ఏరువాక పౌర్ణమిని ఘనంగా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ల్యాండ్ టైటిలింగ్ యాక్టను సీఎం చంద్రబాబునాయుడు రద్దు చేయడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో కమతం కాటమయ్య, రమణ, నాగభూషణ, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

రైతు సంఘం ఆధ్వర్యంలో...

తనకల్లు: మండలపరిధిలోని పడమటవారిపల్లి శుక్రవారం ఏరువాక సందర్భంగా పూజలు నిర్వహించారు. సీపీఐ, రైతు సంఘం ఆధ్వర్యంలో పొలాల్లో నాగలి కట్టి భూమి దున్నారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకుడు కరీముల్లా మాట్లాడుతూ బ్యాంకులు రైతులకు విరివిగా రుణాలివ్వాలన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు చేయడం రైతుల పాలిట వరమన్నారు. కార్యక్రమంలో చౌడప్పయాదవ్, రైతులు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్ చిత్రపటానికి క్షీరాభిషేకం



కేక్ కట్‌చేస్తున్న ఎన్డీఏ కూటమి నాయకులు

ముదిగుబ్బ, జూన్21: ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటానికి శుక్రవారం జనసేన, బీజేపీ, తెలుగుదేశం పార్టీ నాయకులు ముదిగుబ్బ మండలంలోని బస్టాండ్ కూడలిలో క్షీరాభిషేకం చేశారు. ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత మొదటి సంతకం ఉపాధి హామీ పథకాన్ని రైతులకు అనుసంధానం చేస్తూ పెట్టడం హర్షణీయమన్నారు. అనంతరం కేక్ కట్ చేసి పంచారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆదినారాయణ, టీడీపీ మండల కన్వీనర్ కరణం ప్రభాకర్, జనసేన మండల కన్వీనర్ గుర్రం జయచంద్ర, బీజేపీ మండల కన్వీనర్ సోమల ప్రకాష్, కోట్ల బాబి, రాము, నరేంద్ర, మధు, మారుతి తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీయే కూటమి.. రైతుల పక్షపాతి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఓబుళదేవరచెరువు, జూన్ 21: ఎన్డీయే కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతి అని బీజేపీ మండల అధ్యక్షుడు రంగారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు అశ్వర్థప్ప, ఆర్‌ఎంపీ హరిక్రిష్ణ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం పనులను వ్యవసాయానికి అనుసంధానం చేయడం హర్షణీయమన్నారు. రైతుల సంక్షేమం, అభివృద్ధి ఎన్డీయే కూటమి లక్ష్యమన్నారు. ఉపముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన పవన్‌కల్యాణ్ తనమొదటి సంతకాన్ని ఉపాధి పనులను వ్యవసాయానికి అనుసంధానం చేయడంపై పెట్టడం ఆనందదాయకమన్నారు. సమావేశంలో జిల్లా యువజన కార్యదర్శి నరేష్‌బాబు, విశ్వహిందూ పరిషత్ ప్రతినిధి క్రిష్టప్ప పాల్గొన్నారు.

మొక్కలు నాటిన టీడీపీ నాయకులు



ఉపాధ్యాయులకు మొక్కలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

తనకల్లు, జూన్ 21: కందికుంట వెంకటప్రసాద్ కదిరి ఎమ్మెల్యేగా అసెంబ్లీలో ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా మండలపరిధిలోని సీజీ ప్రాజెక్టు వద్ద టీడీపీ నాయకులు పూలమొక్కలునాటారు. బాలికల గురుకుల పాఠశాలలో శుక్రవారం మొక్కలు నాటి అనంతరం కందికుంట చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులకు మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండలకన్వీనర్ రెడ్డిశేఖర్ రెడ్డి, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు సోంపాళ్యం నాగభూషణం, క్లస్టర్ ఇన్‌చార్జి పీజీ మల్లికార్జున, జనసేన కన్వనర్ కేవీ రమణ, సీనియర్ నాయకులు మహబూబ్‌బాషా, మల్లెల రవి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మండల కేంద్రమైన తనకల్లులో టీడీపీ నాయకులు కందికుంట ప్రమాణస్వీకారం సందర్భంగా కేక్ కట్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు అందించారు. కార్యక్రమంలో నాగేంద్రప్రసాద్, కావడి ప్రవీణ్‌కుమార్, తోట సరోజమ్మ, దస్తగిరి పాల్గొన్నారు.

పల్లె కుటుంబంతోనే అభివృద్ధి



బుక్కపట్నంలో సంబరాలు చేసుకుంటున్న టీడీపీ నాయకులు

బుక్కపట్నం, జూన్ 21: పల్లె రఘునాథరెడ్డి కుటుంబంతోనే అన్నివర్గాల అభివృద్ధి సాధ్యమని టీడీపీ మండల నాయకులు పేర్కొన్నారు. పల్లె సింధూరారెడ్డి పుట్టపర్తి ఎమ్మెల్యేగా శుక్రవారం అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా బుక్కపట్నంలో టీడీపీ నాయకులు భారీగా బాణాసంచా కాల్చి మిఠాయి పంచి పెట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ సింధూరారెడ్డితో నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. మండల కన్వీనర్ చింతా మల్లిరెడ్డి, గంగాధర్, జంగం వెంకటరాముడు, నారాయణస్వామి, తెలుగుయువత సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

ధర్మవరం రూరల్, జూన్ 21: విద్యార్థులకు తెలుగు యువత నాయకులు విద్యాసామగ్రిని శుక్రవారం పంపిణీ చేశారు. ధర్మవరం ఎమ్మెల్యేగా సత్యకుమార్‌యాదవ్ ప్రమాణం స్వీకారం చేసిన సందర్భంగా మండలంలోని నాగలూరు గ్రామంలో తెలుగుయువత నియోజకవర్గ ఉపాధ్యక్షుడు నాగలూరు లింగప్ప ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పలకలు, పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. విద్యార్థులు బాగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



విద్యాసామగ్రి అందుకున్న విద్యార్థులు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

● జిల్లా అదనపు న్యాయాధికారి శైలజ

హిందూపురం, జూన్ 21: యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని జిల్లా అదనపు న్యాయాధికారి కంపల్లె శైలజా అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం పట్టణంలోని పలు కళాశాలలు, పాఠశాలల్లో యోగా దినోత్సవాన్ని జరుపుకున్నారు. స్థానిక కోర్టు ఆవరణలో న్యాయవాదులు యోగా ఆసనాలు వేశారు. ఏడీజే మాట్లాడుతూ ప్రతి మనిషి ప్రస్తుత తరుణంలో ఏదో ఒక అనారోగ్యంతో బాధపడుతున్నారని, యోగాను అలవాటు చేసుకుంటే ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత వుంటుందన్నారు. సీనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీదర్, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే విప్రోకేర్ సహకారంతో వాసవీ మహిళా మండలి, కుషాల్ హెల్త్ కేర్ ఆధ్వర్యంలో పులమతి, కొటిపి, తూమకుంట, చౌళూరు కర్ణాటక సరిహద్దులోని గ్రామాల్లో పాఠశాల విద్యార్థులతో యోగాపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో రాధమ్మ, లక్ష్మమ్మ, క్రిష్ణవేణి పాల్గొన్నారు.

పెనుకొండ టౌన్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పెనుకొండ కోర్టు ఆవరణంలో ఘనంగా నిర్వహించారు. న్యాయసేవాధికార సంస్థ, సీనియర్ సివిల్ నాయాఆధికారి వాసుదేవన్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎం. బుజ్జప్ప, జూనియర్ సివిల్ న్యాయాధికారి ముజీబ్ పసపల సయ్యద్ ఆధ్వర్యంలో యోగా గురువు వెంకటేశ్వర్లు సమక్షంలో యోగా శిక్షణ ఇచ్చారు. న్యాయవాదులు భాస్కర్‌రెడ్డి, నాగేశ్వరి పాల్గొన్నారు.

మడకశిర రూరల్: ఒత్తిడిని, వ్యాధులను దూరం చేయడానికి యోగా సంజీవినిలా పని చేస్తుందని యోగా గురువు నాగభూషణం అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం మండలంలోని కళాశాల్లో, పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రమణ, పీడీ రాజేశ్ కుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.

మడకశిరటౌన్: ఆరోగ్య పరిరక్షణకు యోగా ఒక సాధనమని ప్రతి ఒక్కరు యోగాను అలవాటు చేసుకోవాలని న్యాయవాది రాధాకృష్ణ అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని మడకశిర పట్టణంలోని పాఠశాలల్లో విద్యార్థులకు యోగా వల్ల కలిగే లాభాలను వివరించారు.

రొళ్ల: మండలంలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాల, వివిధ పాఠశాలల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. శుక్రవారం అన్ని పాఠశాలల్లో విద్యార్థులతో యోగా చేయించారు. ఎంఈఓ శ్రీదర్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ మైలారప్ప, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

పావగడ: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్ని పాఠశాలలు, యోగా మందిరాల్లో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం 5గంటలకే యోగా మందిరంలో యోగా గురువులు యోగాతో కలిగే ప్రయోజనాలను యోగా గురువు అంతరగంగ శంకరప్ప వివరించారు.



హిందూపురంలో...



మడకశిర రూరల్: శ్రద్ధ పాఠశాలలో యోగా చేస్తున్న విద్యార్థులు

గోరంట్ల: మండల వ్యాప్తంగా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గోరంట్లలోని బాలుర ఉన్నతపాఠశాల, వానవోలు, మందలపల్లి, కొండాపురం సెక్టారు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో యోగా దినోత్సవం జరిపారు. సూపర్‌వైజర్ నాగరాణి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు తల్లులు, పిల్లలకు యోగాపై అవగాహన కల్పించారు. సిద్ధసమాధి యోగా ఆధ్వర్యంలో ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించి, మాధవరాయ ఆలయంలో సురేష్ గురూజీ ఆధ్వర్యం లో ప్రాణాయామం, సూర్యనమస్కారాలు, ఆసనాలు వేయించారు. ముఖ్య అతిథిగా హిందూపురం నుంచి శివగురుప్రసాద్ గూరుజీ హాజరయ్యారు.

పెనుకొండ: యోగాతో శారీరక వికాసం, మానసిక ప్రశాంతత లభిస్తుందని ప్రిన్సిపాల్ కేశవరావు అన్నారు. శుక్రవారం స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆసనాలు వేశారు. వైస్ ప్రిన్సిపాల్ డా.జయప్ప, కోఆర్డినేటర్లు యశోదరాణి, శ్రీదేవి, పీఓలు కాంతారావు, రంగనాయకులు, అధ్యాపకులు ప్రతాప్, నారాయణ, రామన్న పాల్గొన్నారు. అలాగే బ్రిలియన్స్ పాఠశాలలో కరస్పాండెంట్ నాగవేణి ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు.



హిందూపురం పులమతి పాఠశాలలో...



హిందూపురంలో ఆసనాలు వేస్తున్న న్యాయాధికారులు, న్యాయవాదులు



పెనుకొండలో...



పావగడలో...

విష సంస్కృతిని విడనాడాలి

● టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుండుమల



పెరికివేసిన పత్తి మొక్కలను పరిశీలిస్తున్న గుండుమల తిప్పేస్వామి

మడకశిరటౌన్, జూన్ 21: నియోజకవర్గంలో విష సంస్కృతిని విడనాడాలని టీడీపీ ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి అన్నారు. శుక్రవారం అమరాపురం మండలం గొల్లమారనపల్లి గ్రామంలో టీడీపీ కార్యకర్త మంజునాథ్ అనే రైతు పొలంలో గుర్తుతెలియని వ్యక్తులు పత్తి మొక్కలను పెరికి వేశారు. ఎకరా పొలంలో క్రాస్ పత్తి మొక్కలను పెరికి వేశారని, రూ.6లక్షల వరకు నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకొన్న తిప్పేస్వామి పంట పొలానికి వెళ్లి పరిశీలించి రైతుకు ధైర్యం చెప్పారు. వెంటనే నిందితులను పట్టుకోవాలని ఎస్ఐ జనార్ధన్ నాయుడుకు సూచించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల కౌంటింగ్ అనంతరం ఎకరా పొలంలో పూర్తిగా మొక్కలను తొలగించారని, దీనిపై దర్యాప్తుచేసి కఠినంగా శిక్షించాలన్నారు. ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు జయకుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు గణేష్, మాజీ జడ్పీటీసీ నరసింహమూర్తి, నాయకులు శివరుద్రప్ప, విశ్వనాథ్, రామచంద్రప్ప పాల్గొన్నారు.

మంత్రికి స్వాగత ఏర్పాట్లు



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పెనుకొండ టౌన్, జూన్ 21: మంత్రిగా బాధ్యతలు చేపట్టి మొదటిసారిగా పెనుకొండకు వస్తున్న బీసీసంక్షేమం, హ్యాండ్‌లూమ్స్ టెక్స్‌టైల్స్ మంత్రి సవితకు స్వాగతం పలికేందుకు పెద్ద ఎత్తున సన్నాహాలు చేస్తున్నట్లు మండల కన్వీనర్ శ్రీరాములు తెలిపారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పెనుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా మొట్టమొదటిసారిగా గెలిచి అనంతరం మంత్రిగా బాధ్యతలు చేపట్టి ఆదివారం పెనుకొండకు రానున్న మంత్రి సవితకు ఘనంగా స్వాగతం పలికేందుకు ప్రజలు పెద్దఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. ఉదయం కర్ణాటక సరిహద్దులోని టోల్‌గేట్ నుంచి పెనుకొండ వరకు స్వాగత సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, గుట్టూరు సూరి, కేశవయ్య, చిన్నవెంకటరాముడు, లక్ష్మీనారాయణరెడ్డి, త్రివేంద్ర, బాబుల్ రెడ్డి, మావటూరు గోపాల్, అడదాకులపల్లి ప్రసాద్, వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.

మూలనపడ్డ సైకిళ్ల పరిశీలన



పాఠశాలలోని సైకిళ్లను పరిశీలిస్తున్న ఎంఈఈ జాన్ రెడ్డెప్ప

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గోరంట్ల, జూన్ 21: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఐదేళ్లక్రితం మంజూరైన సైకిళ్లను పంపిణీ చేయకుండా మూలన పడేయడంతో ఎంఈఓ జాన్‌రెడ్డెప్ప శుక్రవారం పరిశీలించారు. బాలికల విద్యను ప్రోత్సహిస్తూ, అక్షరాస్యతను పెంపొందించేందుకు అప్పటి టీడీపీ ప్రభుత్వం మంజూరు చేసిన 15 సైకిళ్లు, తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం పంపిణీ ఆపివేయడంతో, గదిలో ఉంచాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనిపై ఆంధ్రజ్యోతిలో మూలన పడ్డ విద్యార్థినుల సైకిళ్లు అనే కథనం శుక్రవారం ప్రచురితమైంది. స్పందించిన ఎంఈఓ పాఠశాలలోని సైకిళ్లను పరిశీలించారు. పాఠశాల సిబ్బందితో చర్చించగా 2016-17 విద్యా సంవత్సరంలో మంజూరైన సైకిళ్లు పంపిణీ అనంతరం 16 మిగిలిపోయినట్లు చెప్పారు. సైకిళ్లను పరిశీలించగా బాగున్నాయని, నివేదికను ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు. ప్రభుత్వంనుంచి అనుమతులు వచ్చిన వెంటనే ఎంపికైన విద్యార్థినులకు పంపిణీ చేస్తామన్నారు.

ఇళ్ల పట్టాలు మంజూరు చేయండి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

లేపాక్షి, జూన్ 21: మండలంలో ఇళ్లులేని 40 మంది నిరుపేదలకు సర్వేనంబరు 358, 361లోని ప్రభుత్వ స్థలంలో ఇళ్ల పట్టాలు ఇవ్వాలని తహసీల్దార్ బాలనరసింహులుకు సీపీఐ నాయకుడు శివప్ప ఆధ్వర్యంలో శుక్రవారం వినతి పత్రాన్ని అందించారు. ఆయన మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాల నుంచి ఇళ్లులేని నిరుపేదలు, ఇళ్ల పట్టాల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా అధికారులు స్పందించడం లేదన్నారు. ఖాళీగా ఉన్న స్థలంలో 40 కుటుంబాల వారు గుడిసెలు వేసుకున్నారన్నారు. వారికి వెంటనే పట్టాలు ఇవ్వాలని, లేనిపక్షంలో దశలవారిగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో నిరుపేదలు, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు

నల్లచెరువు, జూన్ 21: మండలకేంద్రంలోని గీతామందిరంలో వేణుగోపాలస్వామికి శుక్రవారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా స్వామివారికి ఉదయం నుంచి అభిషేకాలు, పూజలు జరిగాయి. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు దాద్దెం వెంకటశివారెడ్డి, భాస్కర్‌రెడ్డి, సూర్యనారాయణ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

డీపీఓ పరిశీలన

గుడిబండ, జూన్ 21: ముత్తుకూరు గ్రామాన్ని డీపీఓ విజయ్ కుమార్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. గ్రామంలో 30 మంది వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నారు. బాధితులను ఆయన వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది, ఇతర అధికారులు గ్రామంలోనే ఉండి వ్యాధి తగ్గుముఖం పట్టేవరకు వైద్య శిబిరాన్ని కొనసాగించాలన్నారు.

విద్యుత్ షాక్‌తో మేక, గొర్రె మృతి

రొళ్ల, జూన్ 21: రొళ్ల గొల్లహట్టి గ్రామానికి చెందిన పూజారి రామప్ప తన గొర్రె, మేకలను బీడు భూమిలో మేపుతుండగా ట్రాన్స్‌పార్మర్‌కు అమర్చిన విద్యుత్ తీగ తగిలి గొర్రె, మేక మృతి చెందాయి. రూ.50వేలు నష్టం వాటిల్లినట్లు కాపరి వాపోయాడు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లే మేక, గొర్రె మృతి చెందాయని, తనకు న్యాయం చేయాలని కోరారు.



గొర్రె, మేక కళేబరాలు

ఆలయ నిర్మాణానికి బాలయ్య విరాళం



చందాపత్రాన్ని కమిటీ సభ్యులకు అందజేస్తున్న శ్రీనివాసరావు

హిందూపురం, జూన్ 21: పట్టణంలోని కూరగాయల మార్కెట్ సమీపంలో నూతనంగా నిర్మించనున్న లక్ష్మీనరసింహ ఆలయానికి ఎమ్మెల్యే బాలకృష్ణ రూ.2లక్షలు అందజేసినట్లు టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆలయ నిర్మాణ కమిటీ గౌరవాధ్యక్షుడు జేఈ వెంకటస్వామి, రాఘవేంద్ర, నిమ్మకాయల రాము, చంద్రమోహన్ రామాంజి శ్రీనివాసులును కలిశారు. ఆలయ నిర్మాణానికి చేయూతనందించాలని కోరగా బాలయ్య తరుపున రూ.2లక్షలు అందించనున్నట్లు తెలిపారు.

ముళ్లపొదల్లోకి దూసుకెళ్లిన లారీ



ముళ్ల పొదల్లోకి దూసుకెళ్లిన లారీ

మడకశిర, జూన్ 21: పట్టణంలోని పావగడ రోడ్డులో శుక్రవారం లారీ అదుపుతప్పి ముళ్లపొదల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కర్ణాటక ప్రాంతం పావగడ నుంచి మడకశిరకు లా రీ వస్తుండగా ఈ సంఘటన చోటు చేసుకుంది. మరోసారి ప్రమాదాలు జరగకుండా ముళ్లకంపలను తొలగించాలని, దెబ్బతిన రహదారులకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జయప్రసాద్ రెడ్డి

హిందూపురం, జూన్ 21: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా హిందూపురానికి చెందిన తనను ఎంపిక చేసినట్లు జయప్రసాద్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర అధ్యక్షులు అంజిన రెడ్డి తనను ఎంపిక చేశారని, అలాగే వార్డు అడ్మిన్‌గా పనిచేస్తున్న చంద్రశేఖర్‌ను ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఎంపిక చేశారన్నారు.



రాష్ట్ర అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలుపుతున్న జయప్రసాద్‌రెడ్డి

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ధర్మవరం, జూన్ 21: పట్టణంలోని చంద్రబాబునగర్‌కు చెందిన సుబ్బరాయుడు శుక్రవారం ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబసభ్యులు గమనించి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి పంపారు. ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియరాలేదు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, విచారణ చేపట్టారు.

ఉపాధ్యాయ సమస్యలపై మంత్రులకు వినతి

ఓబుళదేవరచెరువు, జూన్ 21: ఉపాధ్యాయ సమస్యలపై శుక్రవారం నీటిపారుదల శాఖమంత్రి రామానాయుడు, విద్యాశాఖమంత్రి నారా లోకేశ్‌ను కలిసి విన్నవించినట్లు 1998 ఉపాధ్యాయ సంఘం నాయకులు తెలిపారు. అమరావతిలో అసెంబ్లీ భవనం వద్ద వారిని కలిసి వినతిపత్రం అందచేసినట్లు చెప్పారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కమ్మల నాగరాజు, రఘువీరారెడ్డి, చెన్నకేశవులు, రాఘవేంద్ర, అప్పలరాజు మంత్రులను కలిసినవారిలో ఉన్నారు.

మెగా లోక్‌అదాలత్‌ను విజయవంతం చేద్దాం



పోలీసులతో మాట్లాడుతున్న జిల్లా అదనపు న్యాయాధికారి శైలజ

హిందూపురం, జూన్ 21: కోర్టు, పోలీసుల సమన్వయంతో 29వ తేదీన నిర్వహించే మెగా లోక్‌అదాలత్‌ను విజయవంతం చేద్దామని హిందూపురం అదనపు జిల్లా న్యాయాధికారి కంపల్లె శైలజ అన్నారు. శుక్రవారం పోలీసులతో మెగా లోక్ అదాలత్‌పై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా న్యాయాధికారి స్టేషన్లవారీగా ఉన్న పెండింగ్ కేసులపై ఆరాతీశారు. వీటిలో రాజీకి వచ్చే కేసులన్నీ లోక్‌అదాలత్‌లో పరిష్కరించాలన్నారు. దీర్ఘకాలంగా కోర్టుల చుట్టూ తిరుగుతూ ఆర్థికంగా చితికిపోయిన ఇరువర్గాల కక్షిదారులను పిలిపించి వారితో మాట్లాడి పరిష్కారానికి మార్గం చూపాలన్నారు. చిన్నపాటి తగాదాలు, ఆర్థిక లావాదేవీలు, భార్యాభర్తల మధ్య మనస్పర్థలు, భూతగాదాల కేసులను పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. సీనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీధర్, సెకెండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ సుకుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్, వివిధ పోలీస్‌స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీడీఓ ఎక్కడ..?

● నెలరోజులుగా కార్యాలయానికి రాని అధికారి

అగళి, జూన్ 21: ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ ఎక్కడని ప్రజలు చర్చించుకుంటున్నారు. గతనెల 13న ఎన్నికల పోలింగ్ ముగిసినప్పట్నుంచి ఇప్పటి వరకు ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన ప్రజలు, అధికారులకు అందుబాటులో లేరని ప్రజలు అంటున్నారు. ఎంపీడీఓ గదికి తాళం వేసింది వేసినట్లుగానే ఉంటుందని ప్రజలు చెబుతున్నారు. పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చేవారికి తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి నెలకొంది. ఎంపీడీఓ లేకపోవడంతో ఇతర సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు అంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.



ఎంపీడీఓ చాంబర్‌కు తాళం వేసిన దృశ్యం



గొర్రెలు కాస్తున్న బాలుడు.. బడికి..

గోరంట్ల, జూన్ 21: మండలంలో నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా బడిమానేసిన ఇద్దరు పిల్లలను ఎంఈఓ జాన్‌రెడ్డెప్ప శుక్రవారం ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. ఎనుములకొట్టపల్లికి చెందిన లక్ష్మీనారాయణ, శివమ్మ కుమారుడు గంగరాజు గొర్రెలు కాస్తున్నాడు. విషయం తెలుసుకున్న ఎంఈఓ ఉదయమే గ్రామానికెళ్లి గంగరాజు, అతని తల్లిదండ్రులతో మాట్లాడారు. అబ్బాయి చదువుకోవడానికి ఆసక్తికలిగేలా చేస్తూ, విద్య వల్ల కలిగే ప్రయోజనాలను తల్లిదండ్రులకు వివరించారు. వారి అంగీకారం మేరకు గంగరాజు వయస్సు రీత్యా గోరంట్లలోని బాలురున్నతపాఠశాలలతో 7వతరగతిలో చేర్పించారు. అదే గ్రామంలో సంధ్య అనే బాలిక బడిమానేసి ఇంటి పనులకే పరిమితం కావడంతో బంధువులతో చర్చించారు. భర్త మరణంతో నారత్నమ్మ కర్ణాటకలోని బాగేపల్లి హాస్టల్‌లో పనిచేస్తూ, కుమార్తె సంధ్యను అక్కడే పాఠశాలలో చేర్పించింది. అనంతరం బడి మానిపిచింది. స్వగ్రామంలో బంధువుల వద్ద ఉంచింది. తిరిగి బాలిన కర్ణాటక బడిలో తల్లివద్ద ఉంటూ విద్యనభ్యసించేలా చేర్పించినట్లు ఎంఈఓ తెలిపారు. కార్యక్రమంలో సీఆర్పీలు పద్మజ, హరూన్‌బాషా, రవి పాల్గొన్నారు.



గంగరాజు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎంఈఓ జాన్ రెడ్డెప్ప

రైతులూ.. జాగ్రత్త..!

● వర్షాకాలంలో పొంచివున్న విద్యుత్ ప్రమాదాలు
● సొంత మరమ్మతులతో ప్రాణాలకు చేటు

చిలమత్తూరు, జూన్ 21: వర్షాకాలంలో తరచూ రైతులు, ప్రజలు విద్యుత్ ప్రమాదాలకు గురవుతుంటారు. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రాణాలు పోగొట్టుకోవాల్సిందే. పొలాల్లో బోరుమోటార్ల నుంచి గ్రామాల్లో వేలాడే విద్యుత్ తీగలు, వర్షాలకు నెమ్మగోడలకు విద్యుత్ సరఫరా కావడంతో విద్యుత్ ప్రమాదాలు జరుగుతుంటాయి. ఏ మాత్రం అనుభవం లేకుండానే రైతులు తమ మోటార్ల మరమ్మతుకు చొరవ చూపుతుంటారు. దీనివల్ల విద్యుత్ ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. ఫ్యూజులు మార్చడం తదితర వాటిని సొంతంగా చేసుకోకూడదని విద్యుత్ అధికారులు హెచ్చరిస్తుంటారు. అయినా కొంతమంది వాటిని సొంతంగా చేస్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రతి ఇంటికి ఎర్త్ ఉండేలా చూసుకుంటే ప్రమాదాలను కొంతవరకు నివారించవచ్చు.



కొట్లోపల్లిలో నీటి తొట్టి పక్కనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉన్న దృశ్యం

జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రమాదాలే..

వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాల పట్ల జాగ్రత్తలు పాటించకపోతే ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. సెల్‌ఫోన్‌ని చార్జింగ్‌లో పెట్టి మాట్లాడుతుంటారు. అలా చేయడం ప్రమాదకరం. గ్రామాల్లో అక్కడక్కడా ఇనుప విద్యుత్ స్తంభాలు ఉంటాయి. వాటిని తాకడం మంచిది కాదు. అలాగే ఒక స్తంభం నుంచి మరో స్తంభానికి తాడు కట్టి దుస్తులు ఆరేయడం వంటివి చేయరాదు. అనుకోకుండా ఇనుప స్తంభాలకు విద్యుత్ సరఫరా జరిగి ప్రమాదాలు జరగవచ్చు. ఎక్కడైనా కర్రలకు విద్యుత్ తీగలను కట్టి ఉంటే వాటికి దూరంగా ఉండాలి.

వర్షాకాలంలో బలమైన గాలులు వీయడం వల్ల ట్రాన్స్‌ఫార్మర్లలో సమస్యలు ఎక్కువగా వస్తుంటాయి. దీంతో రైతులు చిన్న చిన్న మరమ్మతులు చేసేందుకు ప్రయత్నిస్తుంటారు. అలాంటి సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశలు ఉంటాయి. వాటి మరమ్మతులు చేయాల్సి వస్తే విద్యుత్ సిబ్బందితోనే చేయించాలి.

మోటార్ల వాడకంలో జాగ్రత్తలు తప్పనిసరి

ట్రాన్స్‌పార్మర్, స్టార్టర్ బాక్సులు చుట్టూ పిచ్చి మొక్కలను ఉండకుండా చూసుకోవాలి. తెగిన విద్యుత్ తీగలను తాకరాదు. వాటి చుట్టూ విద్యుత్ సిబ్బంది అక్కడికి చేరుకునే వరకు ప్రమాద సూచికలు ఏర్పాటుచేయాలి. ప్రధానంగా అటువంటి చోట్లకు పశువులు, చిన్న పిల్లలు వెళ్లకుండా జాగ్రత్తపడాలి.

సొంత మరమ్మతులతో చేటు తప్పదు

వర్షాకాలం విద్యుత్ ప్రమాదాలు ఎక్కువగా జరిగేందుకు అవకాశాలు ఉంటాయి. ఈ సమయంలో సొంతంగా మరమ్మతులు చేసుకునేందుకు వెళితే చేటు తప్పదని విద్యుత్ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఎక్కడైనా విద్యుత్ సమస్యలు ఉంటే వెంటనే సంబంధిత విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వాలి. వర్షాకాలంలో రైతులు మరింత అప్రమత్తంగా ఉండాలి. వ్యవసాయ బోర్ల వద్ద స్టార్టర్లు ఆన్ చేసే సమయంలో సరిచూసుకోవాలి. ఎక్కడైనా విద్యుత్ తీగలు తెగిపడి ఉంటే వాటిని గుర్తించి ఆ పరిసరాలకు దూరంగా ఉండాలి. తడి చేతులతో స్విచ్‌లు ఆన్, ఆఫ్ చేయరాదు. ఎక్కడైనా ప్రమాదమని తెలిస్తే వెంటనే విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలి తప్పా సొంతంగా మరమ్మతులు చేయరాదు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

మడకశిరటౌన్, జూన్ 21: డీఎస్సీ ఎస్‌జీటీ అభ్యర్థులకు మడకశిర ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు ఉచిత శిక్షణను అందిస్తున్నారని, నియోజకవర్గం వ్యాప్తంగా డీఎడ్ పూర్తి చేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు మనోహర్ కోరారు. తనవంతు చేయూత అందించాలన్న సదుద్దేశంతో ఉచిత శిక్షణను ఏర్పాటు చేస్తున్నారని, డీఎస్సీలో ఎస్‌జీటీ పోస్టులకు అర్హతగల అభ్యర్థులు 8328074070, 8500236832 నంబర్లలో సంప్రదించాలని కోరారు. ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

చౌకధరల డిపో డీలర్ల రాజీనామా

అగళి, జూన్ 21: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతో చౌకడిపో డీలర్లు రాజీనామాలు చేస్తున్నారు. ఒక్కొక్కరు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి తమ రాజీనామా పత్రాలను తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు అందజేస్తున్నారు. ముందస్తుగానే గ్రామాలలో డీలర్లతో మాట్లాడి రాజీనామాలు చేయాలని సూచించారు. మండల వ్యాప్తంగా 26 షాపులున్నాయి. ఇంకా కొంత మంది రాజీనామాలు చేయాల్సి ఉంది.

'పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలి'

కొత్తచెరువు, జూన్ 21: చిన్నతనం నుంచి విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవరచుకోవాలని హుందాయ్ కంపెనీ ఫ్రాన్సిస్ జనరల్ మేనేజర్ కళాసాగర్‌రెడ్డి సూచించారు. పుస్తకపఠనం వల్ల విజ్ఞానంతోపాటు మేధాశక్తి పెంపొందుతుందన్నారు. మండలంలోని బండ్లపల్లి జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో గ్రంథాలయాన్ని హుందాయ్ కార్ల కంపెనీ ఆధ్వర్యంలో నిర్మించారు. గ్రంథాలయాన్ని శుక్రవారం ఆ కంపెనీ ప్రతినిధులు ప్రారంభించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో హుందాయ్ కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ చదువుతోపాటు విద్యార్థులు గ్రంథాలయంలోని పుస్తకాలను చదువుతుండాలన్నారు. శ్రీసత్యసాయిజిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సౌకర్యార్థం సీఆర్ యాక్టివిటీస్ కింద పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అందులో భాగంగా గ్రంథాలయాన్ని రూ.12లక్షల వ్యయంతో నిర్మించామన్నారు. గ్రంథాలయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.